క్లుప్తంగా

రొయ్య తలకాయ ప్రాసెసింగ్ ప్లాంటుపై చర్యలు తీసుకోండి

సింగరాయకొండ: స్థానిక ఊళ్లపాలెం రోడ్డులోని రొయ్యల తలకాయల ప్రాసెసింగ్ ప్లాంటు సెవన్ హార్స్ కంపెనీ నుంచి ప్రతిరోజు దుర్గంధం వస్తోందని, వ్యర్థాల నుంచి వచ్చే మురుగు నీరు కూడా వదలటంతో కంపెనీ పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోందని సోమరాజుపల్లి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్న వారు కంపెనీ నుంచి వస్తున్న దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంపెనీ నుంచి దుర్గంధం రాకుండా, మురుగునీరు పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ప్రజలు తహశీల్దార్ సీహెచ్ ఉషకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో షేక్ సుల్తాన్ తదితరులు ఉన్నారు.

నూతన బోధనా పద్ధతులు ఉపయోగించాలి

హనుమంతునిపాడు: నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు బోధించాలని కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష్ బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి మండలాల్లో సైన్స్ బోధించే ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ తరగతులు నిర్వహించారు. అనంతరం నూతన విద్యా విధానంలో వచ్చిన బోధన పద్ధతులు, మార్పులపై ఆర్పీలు శిక్షణ ఇచ్చారు.

కలశాల బహూకరణ



దేవస్థానానికి బహూకరించిన కలశాలు

ఉలవపాడు: మండల పరిధిలోని కొల్లూరుపాడు యాదవ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ, పోలేరమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానానికి ఉలవపాడు కుచెందిన మహంకాళి లక్ష్మీనారాయణ అలియాస్ భీమయ్య కలశాలను బహూకరించారు. సెప్టెంబరు 8న వేద పండితులచే విగ్రహ ప్రతిష్ట, కలశ ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేఖంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నుంచి ప్రచారజాతా ప్రారంభించారు. దీనిలో భాగంగా ఉప్పుచెరువు, సుందరయ్యనగర్, పలుకూరు ప్రాంతాల్లో సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ బొమ్మ వద్ద జరిగిన కార్యక్రమంలో గౌస్ మాట్లాడుతూ అధిక ధరలు, పెరుగుతున్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని జరిగే కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు మున్వర్‌సుల్తానా, ఎస్ పవన్‌కుమార్, డీఎం రాయుడు, ఎస్‌కే మల్లిక, ఎం మల్లిక, ఎస్‌కే షాహీదా, ఎస్‌కె మహాహుజా తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ కోఆప్షన్ సభ్యుడు మృతి



నిషార్ (ఫైల్)

గుడ్లూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు నిషార్(53) బుధవారం మృతి చెందాడు. మండలంలోని దప్పళంపాడు గ్రామానికి చెందిన నిషార్ గత కొంత కాలంగా హైదరాబాదులో వ్యాపారాలు చేసుకుంటు అక్కడే ఉన్నాడు. నిషార్ 2014లో మండల కోఆప్షన్ సభ్యులుగా పని చేశారు. బుధవారం తెల్లవారుజామున గుండె నొప్పి రావడంతో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని దప్పళంపాడు గ్రామానికి తీసుకొని వచ్చారు. ఎంపీపీ పులి రమేష్,జెడ్పీటీసీ బాపిరెడ్డి,వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బిల్లా రమణయ్య, మండల కన్వీనర్ క్రిష్ణయాదవ్, జేసీఎస్ కన్వీనర్ కిషోర్, మాజీ ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ నాయకులు సంతాపం తెలిపారు.

ఘనంగా రాఖీ వేడుకలు



పాఠశాలలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడు నిడమానూరి సురేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు రాఖీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

గుడ్లూరు: అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కోర్శిపాటి బాపిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ శాఖల సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు వివరించారు. వ్యవసాయాధికారి రవికుమార్ మాట్లాడుతూ ఈ మూడు నెలల క్రితం 222 మిల్లీమీటర్ల వర్షపాతానికి గానుకేవలం 63 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందన్నారు. 7863 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.6.32 కోట్ల నగదు జమ చేశామన్నారు. ఉద్యానవన శాఖ అధికారి బ్రహ్మసాయి మాట్లాడుతూ ఉద్యానవన శాఖ కింద 5 ఎకరాలు లోపు ఉన్న రైతులకు పవర్‌వీలర్లు, తైవాన్‌స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. పండ్లతోటలు, కూరగాయలు సాగు చేసే వారికి 50 శాతం సబ్సిడీపై విత్తనాలు, మొక్కలు అందజేస్తామన్నారు. వైద్యాధికారి మారుతీరావు మాట్లాడుతూ ప్రజల వైద్య ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద వేస్తుందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ భూముల రీ సర్వే కింద పరకొండపాడు, దప్పళంపాడు, గుండ్లపాలెం గ్రామాలు పూర్తయ్యాయని, పూరేటిపల్లి, అమ్మవారిపాలెం, బసిరెడ్డిపాలెం గ్రామాల్లో జరుగుతుందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేశామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు అందించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాపిరెడ్డి, వీఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యుడు రషీద్, వివిధ శాఖల అధికారులు ఇమ్మానీయేలు, రాజశేఖర్, శ్రీనివాసరావు, ఎంఈఓ గోవర్ధన్, అబ్దుల్లా, అశోక్, నీలాంబరీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళా పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.బేబీరాణి



వల్లూరులో పాడి రైతులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

టంగుటూరు: మహిళా పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.బేబీరాణి అన్నారు. మండలం లోని వల్లూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జగనన్న పాల వెల్లువ పథకానికి సంబంధించి పాడి రైతులకు రుణ మేళా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ బేబీరాణి మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ పాల సేకరణ కేంద్రాల్లో పాలు పోసే మహిళా పాడి రైతులకు పీడీసీసీ బ్యాంకు ద్వారా గేదెల కొనుగోలుకు రుణాలు అందిస్తున్నామని, వాటితో పాటు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, టీఎంఆర్, గడ్డి కటింగు యంత్రాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా 83 మంది మహిళా పాడి రైతులు అర్జీలు అందించారన్నారు. కార్యక్రమంలో డీసీఓ రాజశేఖర్, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కసుకుర్తి సుధీర్‌బాబు, ఏపీఎం హనుమంతురావు, నాయకులు కుందం హనుమారెడ్డి, సర్పంచి వల్లూరి పద్మ, ఎంపీటీసీ యలసిరి సత్యవాణి, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

103 మందికి వైద్య పరీక్షలు



పోట్లూరులో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గుడ్లూరు: మండలంలోని పోట్లూరు ఎస్టీ కాలనీలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో కావలి రామస్వామి, శ్రీసాయి వైద్యశాలలకు చెందిన డాక్టర్లు మస్తాన్, చైతన్య, పవన్‌కుమార్, పుష్పక్‌లు 103 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్యశాలల వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భైరవకోనలో గోశాల నిర్మాణానికి భూమిపూజ



గోశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న దాతలు

సీఎస్‌పురం (పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని భైరవకోనలో దాతలు అయ్యలూరి వారిపల్లె సర్పంచ్ ముత్యాల భారతి, నారాయణ రెడ్డి దంపతులు తమ సొంత నిధులతో నిర్మించనున్న గోశాల నిర్మాణానికి బుధవారం వైఎస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డితో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు వారిచేత గర్తపూజ, పుణ్యాహవచనంచేయించి గోశాల నిర్మాణానికి భూమిపూజ దాతలచేత నిర్వహింపచేశారు. బేరి వివేకానందరెడ్డి, సాక్యశ్రీ దంపతులు తమ సొంతనిధులతో నిర్మించిన డ్రస్సింగ్‌భవనాన్ని పూర్తిచేసి ఆలయానికి అందజేశారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో భక్తుల సౌకర్యార్థం గది నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేకపూజలు నిర్వహిచారు. సిద్దు వెంకటరెడ్డి, నారాయణస్వామి ఆలయ వైస్ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, సర్పంచులసంఘం అధ్యక్షుడు చెరుకుపల్లి రాధాక్రిష్ణారెడ్డి, సోడా రవిచంద్రారెడ్డి, డి.క్రిష్ణారెడ్డి, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్

సీఎస్‌పురం (పామూరు): విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్ అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్, నాగులవరం జెడ్పీహెచ్ఎస్‌లలో బుధవారం జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను ఆయక ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పూర్వపుస్థితిని గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో సులభతర బోధన చేయాలన్నారు. అదేవిధంగా హాజరుశాతాన్ని పెంచాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ విధిగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, హెచ్ఎం ఖాదరున్నీసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాల అందచేత



ఎన్‌సీసీ విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న సుబేదార్, హవాల్దార్‌లు

కనిగిరి రూరల్: విద్యార్థులకు ఎన్‌సీసీ కోర్సుతో భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో లాభం చేకూరుతుందని ప్రధానోపాధ్యయుడు జి.సంజీవీ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో ఎన్‌సీసీ రెండేళ్లు పూర్తి చేసిన 27 మంది విద్యార్థులకు ఆర్మీ సుబేదార్ మేజర్ ఆర్‌బీ సింగ్, హవాల్దార్ పి టాపల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఏఎన్‌ఓ పల్లా కోటి రత్నం మాట్లాడుతూ ఎన్‌సీసీ ధ్రువీకరణ పత్రాలు పొందిన వారికి ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఎన్‌సీసీ కోర్సులోని వివిధ అంశాలను, నిబంధనలను సుబేదార్, హవాల్దార్‌లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం నాగ పద్మజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాలపాడులో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కిరణ్

పొన్నలూరు: కిషోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీసీ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ పేర్కొన్నారు. మండలంలోని మాలపాడు కేజీబీవీ పాఠశాల్లో బుధవారం విద్యార్థినులకు బాల్య వివాహాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు పటిష్టమైన ఆరోగ్యం కోసం ఆకు కూరలు, పండ్లు, ప్రొటీన్లు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి బీ సుభాషిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి జయరావు, మహిళా పోలీస్ శ్రీలత, సిరిగిరి గోపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు చూర వేలం ప్రక్రియ పూర్తి



పొగాకు చూర వేలం పూర్తయిందని చెబుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారంతో పొగాకు చూర వేలం ప్రక్రియ పూర్తయిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులుగా వేలం కేంద్రానికి సంబంధించి అన్ని క్లస్టర్ల రైతులు 5241 చూర బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 5052 అమ్ముడుపోగా, 189 పొగాకు చూర బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ.209 కాగా, కనిష్ట ధర రూ.50, సరాసరి రూ.118. 92 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 21 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

- ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు భారీ వాహనాలకు అనుమతి లేదు
- నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు, వాహనాలు సీజ్ చేస్తాం
- సీఐ శివ రామకృష్ణారెడ్డి హెచ్చరిక



సీఐ శివ రామకృష్ణారెడ్డి

కనిగిరి రూరల్: ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించే విధంగా ట్రాలీ ఆటోలు, ఇతర భారీ వాహనాలు పట్టణంలోని ప్రధాన రోడ్లల్లోకి వస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శివ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోడ్ లారీలు, కర్రల, పొగాకు లోడ్ ట్రాక్టర్లు, గ్రానైట్ లారీలు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల లోపు పట్టణంలోని ప్రధాన సెంటర్లలో తిరగడం, అన్‌లోడ్ చేయడం చేయరాదన్నారు. అలాగే ట్రాలీ ఆటోలు, ట్రాక్ ఆటోలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పట్టణంలో అన్‌లోడ్ చేయకూడదన్నారు. కర్రల లోడ్ ట్రాక్టర్లు, పొగాకు ట్రాక్టర్లు గ్రానైట్ వాహనాలకు పట్టణంలోని గార్లపేట రోడ్ నుంచి చెప్పల్ బజార్‌కు, చెప్పల్ బజార్ నుంచి గార్లపేట రోడ్ వైపు వెళ్లేందుకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతి లేదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఆ వాహనాలను సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వరికుంటపాడు: జీవాల మేత కోసం వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన మండలంలోని అశోక్‌నగర్ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నె గడ్డకు చెందిన గజ్జల పెదవెంగయ్య (52) జీవాలను మేపుతుంటాడు. రోజులాగే మేత తెచ్చేందుకు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు పంచాయతీ అశోక్‌నగర్ గ్రామ శివారుకు వెళ్లాడు. చెట్టు మండలు కొడుతుండగా దగ్గరలో ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విజయ్ శ్రీనివాస్ తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెదవెంగయ్యకు భార్య ఉంది. ఘటనా స్థలాన్ని ఉదయగిరి సీఐ గిరిబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గృహ సారథుల బీమా రిజిస్ట్రేషన్‌లో మున్సిపల్ చైర్మన్ గఫార్, కౌన్సిలర్

కనిగిరి రూరల్: సీఎం వైస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్న పార్టీ గృహ సారథుల సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 9వ వార్డులోని సచివాలయ పరిధిలోని గృహ సారతులకు జీవిత బీమా రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడంలో గృహ సారథులు కీలక పాత్ర పోషించాలన్నారు. స్థానిక కౌన్సిలర్ దేవకి సత్యావతి, కన్వీనర్లు, దేవకి రాజేష్, కృష్ణా, మాదాల సూరిబాబు, గృహ సారథులు పాల్గొన్నారు.

4న ఉపసర్పంచ్ ఎన్నిక

పీసీపల్లి: రాష్ట్ర ఎన్నికల శాఖ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 4న పెదఅలవలపాడు పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ఎన్నికను సెప్టెంబర్ 4న ఉదయం 11 గంటలకు సంబంధిత పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

చంద్రబాబు మాటలు హాస్యాస్పదం

- ఎంపీపీ దంతులూరి ప్రకాశం



కార్యదర్శులు, బీఎల్వోలతో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: టీడీపీ నేత చంద్రబాబు వైఖరి చూస్తే.. దొంగే.. దొంగా.. దొంగా అన్నట్లు ఉందని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నెల రోజుల క్రితమే నియోజకవర్గంలో 18 వేల డబుల్, దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి నిష్పక్షపాతంగా తొలగించాలని ఆర్డీఓను ఆదేశించారని గుర్తుచేశారు. రాజకీయ పార్టీల అఖిల పక్ష సమావేశంలో, బీల్వోల సమావేశంలో కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించి డబల్, దొంగ ఓట్లను సమగ్ర పరిశీలన చేసి తొలగించాలని చెప్పారన్నారు. ఈ మేరకు వార్డుల వారీగా డబుల్, దొంగ ఓట్ల జాబితాలను ఆర్డీఓకు అందజేశామన్నారు. ముందుగా వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల ఓట్లను తొలగించి, ఆ తర్వాతనే ఇతరుల డబల్, దొంగ ఓట్లను తొలగించాలని చెప్పినట్లు వెల్లడించారు. పార్టీలకతీతంగా నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కానీ టీడీపీ నేతలు కనిగిరి నియోజకవర్గంలో డబుల్ ఓట్ల తొలగింపుకు సహకరించకుండా అధికారులపై వత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు మాత్రం ఎవరో చెప్పిన స్క్రిప్టితో, కనీస అవగాహన లేకుండా ఢిల్లీ వెళ్లి కనిగిరిలో దొంగ ఓట్లు అంటూ మాట్లాడుతున్నారన్నారని ఎద్దేవా చేశారు. 2014 నుంచే ఓటర్ల జాబితాలో ఆ ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. దొడ్డిదారిన అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆ పార్టీ నేతలు డబుల్, దొంగ ఓట్లను ఓటర్ల జాబితాలో చేర్పి కుట్ర చేశారని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు వైఖరి టీడీపీ నీచ రాజకీయానికి నిదర్శనమని తీవ్రంగా దుయ్యబట్టారు. కనిగిరిలో ఓటర్ల జాబితా పారదర్శకంగా చేయకపోతే ఎన్నికల కమిషనకు ఫిర్యాదు చేస్తానన్నారు. తొలుత బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులుతో జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ నిష్పక్ష పాతంగా, పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేయాలని తెలిపారు. ఎవరికి భయపడోద్దని, బీఎల్వోలు తప్పు చేస్తే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యం



ఇంటి వద్ద వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ నాగరాజు

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తున్నామని కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని వర్ధినేనివారిపాలెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డాక్టర్ నిర్వహించారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు ఉన్న వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో 52 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో మంచానికే పరిమితమైన సూరా నాగమ్మ ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని పాఠశాల వద్దకు వెళ్లి కిశోర బాలికలకు వైద్య సేవలు అందించారు. ఎంఎన్‌హెచ్‌పీ దానా షారోన్, స్వాతి, పద్మ, మస్తానమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ హరిబాబు

హనుమంతునిపాడు: భూముల రీ సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్. హరిబాబు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లకు బుధవారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే ఎంత వరకు ఎన్ని గ్రామాలు పూర్తి చేశారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల పట్టాదారు పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు పరిశీలించి నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. సర్వేయర్లంతా అందుబాటులో ఉంటూ సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యాలయంలో మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, సచివాలయ సర్వేయర్లు, షేక్ నజ్మా, ఎస్ రాజశేఖర్, శ్రీను తదితరులున్నారు.

పోకూరులో భూసర్వే గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ సుందరమ్మ

వలేటివారిపాలెం: మండల పరిధిలోని పోకూరులో జగనన్న భూ హక్కు, జగనన్న శాశ్వత భూ రక్ష పథకం కింద పోకూరు రెవెన్యూ పొలాలను భూ సర్వేకు ఎంపిక చేసినట్లు తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో బ్రిటిష్ పరిపాలన సమయంలో భూ సర్వే చేశారని, తిరిగి ప్రస్తుతం ప్రభుత్వం రీ సర్వే ఉచితంగా చేస్తుందన్నారు. పోకూరు రెవెన్యూ పరిధిలోని రైతులతో పాటు అత్తంటివారిపాలెం, బడేవారిపాలెం, రైతులు తమ భూములకు సంబంధించిన రిజిస్ట్రేసన్ డాక్యుమెంట్లుతో పాటు భూములకు సంబంధించిన రికార్డులు, ఆధార్‌కార్డు, ఫొటోలను ఆయా గ్రామాల వీఆర్‌ఓలకు అందజేయాలని ఆమె తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతుల భూమలను సర్వే చేస్తునప్పుడు రైతులు దగ్గర ఉండి కొలతలు సర్వే చేయించుకోవాలన్నారు. కొలతలు వేసిన భూములకు ప్రభుత్వమే సరిహద్దు రాళ్లు ఉచితంగా వేస్తారని తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్, వీఆర్‌ఓ హరికృష్ణ, సర్వేయర్ యశ్వంత్, వీఆర్ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టంగుటూరులో స్పోర్ట్స్ కాంప్లెక్స్



టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెక్రటరీ వనజ, పీటీలు, పీడీలు

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొండపి నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ని బుధవారం మొదటి సారిగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వనజ పాల్గొని మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యత వివరిస్తూ నూతన విద్యా విధానంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ శాస్త్రీయ పద్ధతిలో బోధించినప్పుడు అద్భుతమైన క్రీడాకారులను తయారు చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురాగలుగుతారన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ కో ఆర్డినేటర్ తుల్లిబిల్లి అశోక్‌బాబు మాట్లాడుతూ ఇంత వరకు ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఫిజికల్ ఎడ్యుకేషన్ కూడా విద్యా వ్యవస్థలో భాగమని గుర్తించలేదు. ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించి విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసాన్ని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల పీటీలు, పీడీలు 40 మంది పాల్గొన్నారు.